
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



సోమశిలలో 30.191 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 30.191 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 120 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.63,500
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,734
3శాతం జీఎస్టీతో	రూ.5,906
నవర (8గ్రా)	రూ.47,248

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.6 /26.4

శనివారం గాలిలో తేమ 78 శాతం ఉంది. పలుచోట్ల వర్షం కురిసింది. ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు చేయండి

- వివిధ శాఖల పనితీరు సరిగా లేదు
- అధికారులపై ఎంపీ ఆదాల, కలెక్టర్ అసహనం



జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఎంపీ ఆదాల, కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(పొగతోట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాల అమలుకు వివిధ శాఖల ద్వారా కేటాయిస్తున్న నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేసేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) ఎంపీ ఆదాల, కలెక్టర్ ఎం.హరి నారాయణన్ అధ్యక్షతన జరిగింది. డీఆర్‌డీఏ, వ్యవసాయశాఖ, హార్టికల్చర్, హౌసింగ్, టిడ్కో, డ్వామా, ఐసీడీఎస్, నేషనల్ హైవే, రైల్వే తదితర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారుల సమాధానాలపై ఎంపీ, కలెక్టర్‌తోపాటు కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరయ్యేటప్పుడు పూర్తి సమాచారంతో రాకపోవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. వ్యవసాయశాఖ, హార్టికల్చర్, డ్వామా, ఇరిగేషన్ తదితర శాఖల అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దిశ సమావేశం ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు సమన్వయంతో పనిచేసి రైతుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో నిమ్మ, మామిడి, బత్తాయి, జామ, ఇతర ఉద్యాన సంబంధిత పంటలు సాగులో ఉన్నాయని, వీటికి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని తెలిపారు. నూతన రహదారుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. రైతుల కోసం పీఎం కిసాన్, యాంత్రీకరణ, కిసాన్ డ్రోన్ శిక్షణ, హెల్త్ సాయిల్ టెస్టింగ్ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి

ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలి. రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ సదుపాయాలపై వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు దృష్టి సారించాలి. జిల్లాలో మెట్ట ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి.
– మానుగుంట మహీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే, కందుకూరు

పథకాల అమలు వేగవంతం చేయండి

దిశ సమావేశంలో 16 శాఖలకు సంబంధించి సమీక్షించాం. ప్రజాప్రతినిధుల సూచనలు తీసుకుని సంక్షేమ పథకాల అమలును అధికారులు వేగవంతం చేయాలి. మామిడి తోటలు సాగు చేస్తున్న రైతులకు సంబంధిత అధికారులు సూచనలివ్వాలి. మంజూరైన ఉపాధి పనులను నిర్వహించని నేపథ్యంలో ఇద్దరు అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేస్తాం.
– ఎం.హరినారాయణన్, కలెక్టర్

నిరుద్యోగులకు ఉపాధి చూపండి

డీఆర్‌డీఏ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి చూపండి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్స్‌లో శిక్షణ పొందుతున్న వారికి మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలి. పాఠశాలల్లో మరమ్మతులకు గురైన ఆర్‌ఓ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలి.
– పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ

న్యూస్‌రీల్

పటిష్టంగా భూముల రీసర్వే

- జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్



మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియ పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జేసీ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 711 గ్రామాలకు గాను 214 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తయిందని, ఇంకా 138 గ్రామాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వీటికి సంబంధించి 111 గ్రామాల్లో పొలాల్లో హద్దు రాళ్లు వేయడం పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 609 గ్రామాల్లోని ఇనాం భూములు, అసైన్‌మెంట్ భూములకు సంబంధించి నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని సచివాలయాల్లోనే రైతులు భూముల రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

కాటరాక్ట్ ఆపరేషన్లు 5,111 మందికి అవసరం

నెల్లూరు సిటీ: అక్టోబర్ నెలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో ఏర్పాటు చేసిన కంటి పరీక్షల శిబిరాల్లో జిల్లాలో 5,111 మందికి కాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని నిర్ధారించినట్లు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని తన చాంబర్‌లో శనివారం ఆయన జిల్లా వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ కాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని నిర్ధారించిన వారిని మండలాల వారీగా ఆరోగ్యశ్రీ హాస్పిటళ్లు, ఎన్‌జీఓ హాస్పిటళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులకు పంపి నవంబర్, డిసెంబర్ నెలల్లో వారికి ఆపరేషన్లు చేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

మెదడుకు పోటు.. తస్మాత్ జాగ్రత్త

స్ట్రోక్ అంటే చాలా మంది హార్ట్ ఎటాక్ అనుకుంటారు. అలాగే మెదడుకు వచ్చే పోటును బ్రెయిన్ స్ట్రోక్ అంటారు. దీనిపై ప్రజల్లో అవగాహన తక్కువగా ఉంది. బ్రెయిన్ స్ట్రోక్ వల్ల కాళ్లు, చేతులు పడిపోతేనో, మూతి వంకర పోయిన తర్వాత మాత్రమే వైద్యుల వద్దకు వెళుతున్నారు. అయితే లక్షణాలను ముందుగా గుర్తించి వెంటనే వైద్యుల వద్దకు వెళితే జరగాల్సిన నష్టాన్ని సాధ్యమైనంతగా నివారించవచ్చు. నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.



పెరుగుతున్న బ్రెయిన్‌స్ట్రోక్ బాధితులు

- బీపీ, షుగర్ నియంత్రణ లేకపోవడంతోనే..
- జీవనశైలిలో మార్పులతో పరిష్కారం
- నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే

నెల్లూరు సిటీ: మారుతున్న జీవన విధానం, కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. కరోనా తరువాత ప్రతి ఒక్కరిలో ఆరోగ్యంలో మార్పులు వచ్చాయి. వ్యాధుల లక్షణాలను బట్టి ముందుగా వైద్యులను సంప్రదించడం ఎంతో అవసరం. దీనినే గోల్డెన్ పీరియడ్ అంటారు. తద్వారా జరగబోయే నష్టాన్ని వీలైనంతగా నివారించే అవకాశం ఉంది. బ్రెయిన్ స్ట్రోక్‌కు సంబంధించి కూడా ముందుగా కనిపించే లక్షణాలను బట్టి డాక్టర్లను సంప్రదిస్తే ప్రమాదం నుంచి బయటపడవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం అక్టోబర్ 29వ తేదీన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తోంది.

బ్రెయిన్ స్ట్రోక్ అంటే..

సాధారణంగా శరీరంలో అన్ని భాగాల్లో రక్త సరఫరా సంపూర్ణంగా జరగాలి. అలా జరిగితేనే ఆరోగ్యంగా ఉంటారు. శరీరంలో ఏ భాగానికైనా రక్త సరఫరా సక్రమంగా జరగకపోతే ఆ భాగం అచేతనంగా మారుతుంది. ఏ సందర్భంలోనైనా మెదడుకు ఆ స్థితి ఎదురైతే మరణం సంభవిస్తుంది. దీనినే వైద్య పరిభాషలో బ్రెయిన్ స్ట్రోక్ అని అంటారు. రక్త ప్రసరణలో అసమతుల్యతకు రెండు కారణాలు ఉన్నాయి. అందులో ఒకటి కొవ్వు చేరడం వల్ల రక్తనాళాల్లో పూడికలు ఏర్పడడం, రెండోది రక్తనాళాలు బలహీనపడి చిట్లడం. స్ట్రోక్ శరీరంలో ఏ భాగానికైనా రావచ్చు. సదరు శరీర భాగానికి రక్తం అందకపోవడం, గడ్డ కట్టడం వల్ల పక్షవాతం వస్తుంది. ఈ స్థితి నుంచి కోలుకోవడం అంత సులభమైన విషయం కాదని వైద్యులు చెబుతున్నారు. మెదడు, గుండెకు వచ్చే స్ట్రోక్‌లు ప్రాణాంతకాలని పేర్కొంటున్నారు.

ఇలా చేస్తే మేలు

- అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ లేకుండా చూసుకోవాలి.
- మద్యం, పొగ తాగడం పూర్తిగా వదిలివేయాలి.
- ఒత్తిడికి గురికాకూడదు.
- రోజూ కనీసం అర్ధగంటపాటు నడక కానీ, వ్యాయామం కానీ చేయాలి.
- ఉప్పు తినడం తగ్గించాలి. శరీర బరువు అదుపులో ఉంచుకోవాలి.
- గుండె కొట్టుకోవడంలో మార్పులు గమనించాలి.
- డయాబెటిస్ ఉన్న వారు గ్లూకోజ్ స్థాయిని నియంత్రించుకోవాలి.
- ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలు, పండ్లు, చేపలు, తృణధాన్యాలు ఆహారంగా తీసుకోవాలి.
- బీపీ, షుగర్, గుండె సంబంధిత మందులు వాడుతున్న వారు ఆపకూడదు.
- తిన్న వెంటనే పడుకోవడం శ్రేయస్కరం కాదు.

గోల్డెన్ పీరియడ్ ఎంతో కీలకం



బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే నాలుగున్నర గంటల్లోపు సమీప న్యూరోఫిజీషియన్ ఉన్న ఆస్పత్రికి వెళితే వెంటనే వారు థ్రాంబోలైసిస్ అనే ఇంజెక్షన్ వేస్తారు. ఇది వెంటనే రక్తనాళాల్లో గడ్డకట్టిన రక్తాన్ని పలుచబడేలా చేసి రక్త ప్రసరణలో ఇబ్బందులు లేకుండా చేస్తుంది. నాలుగున్నర గంటలు దాటితే ప్రతి నిమిషానికి బ్రెయిన్‌లో న్యూరాన్స్ తగ్గిపోతాయి. ఈ గోల్డెన్ పీరియడ్ ఎంతో కీలకం.
– డాక్టర్ ఎ.యామిని, న్యూరాలజిస్ట్, ఎండీ, డీఎం

ఆరోగ్య సమస్యలను నియంత్రణలో ఉంచుకోవాలి



ఆరోగ్య సమస్యలను నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా 90 శాతం బ్రెయిన్ స్ట్రోక్‌ను నివారించవచ్చు. రోగి వయస్సు, ఆరోగ్య పరిస్థితిని బట్టి స్ట్రోక్ నుంచి త్వరగా కోలుకునే అవకాశాలు ఉన్నాయి. బీపీ, షుగర్‌లను కంట్రోల్‌లో ఉంచుకోవాలి. ప్రతి రోజూ వ్యాయామం చేయాలి. గుండె జబ్బుకు సంబంధించిన మందులను ఆపకూడదు.
– డాక్టర్ ఎ.హేమలతారెడ్డి, న్యూరాలజిస్ట్, ఎండీ, డీఎం

కరోనా తర్వాత పెరిగిన కేసులు

కోవిడ్-19 ప్రపంచాన్ని వణికించిన విషయం తెలిసిందే. కరోనా తరువాత మనిషిలో కొత్తగా అనేక ఆరోగ్య సమస్యలు కనిపిస్తున్నాయి. అందులో ప్రధానమైన సమస్య థ్రాంబోసిస్ ఒకటి. రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం చాలామందిలో వారికి తెలియకుండానే జరుగుతోంది. తద్వారా స్ట్రోక్‌కు గురయ్యే వారి సంఖ్య ఇటీవల కాలంలో బాగా పెరిగింది.

వయస్సుతో నిమిత్తం లేకుండా..

గతంలో ఓ నిర్దిష్ట వయస్సు తర్వాతే స్ట్రోక్ వచ్చేది. అప్పట్లో 40 ఏళ్ల నంచి 60 ఏళ్ల వయస్సు లోపు వారిలోనే ఈ సమస్య కనిపించేది. ఇటీవల కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ప్రస్తుతం చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికైనా ఈ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంది. ఇటీవల చిన్న వయస్సు వారిలోనూ ఈ సమస్యను గుర్తిస్తున్నామని వైద్యులు చెబుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయమైన వారికి, భారీ శరీరం కలవారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి, వంశ పారంపర్యంగా పక్షవాతం వచ్చే వారికి, మద్యపానం.. ధూమపానం చేసే వారికి, రక్తం చిక్కబడడం, రక్తనాళాలు పటుత్వం కోల్పోవడం ద్వారా స్ట్రోక్ ముప్పు ఉంటుందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం



కావలిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



నెల్లూరు ఆర్టీసీ మెయిన్ బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

- రౌడీమూకల తీరుపై ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

కావలి: పట్టణంలో రౌడీమూకలు చెలరేగిపోయి విధుల్లో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై నడిరోడ్డులో అమానుషంగా దాడి చేసి కాళ్లు, చేతులతో దారుణంగా తన్నడం పాశవిక చర్య అని కావలి ఆర్టీసీ ఉద్యోగులు అన్నారు. కావలిలో రోడ్డుపై వాహనాన్ని ఆపి ఉంటే హారన్ కొట్టి సైడ్ ఇవ్వమని అడిగిన విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ రామ్‌సింగ్‌పై రౌడీమూకలు దాడి చేశాయని, బస్సును మద్దూరుపాడు వద్ద హైవేలో ఆపి డ్రైవర్‌ను చితకబాదడం విచారకరమని అన్నారు. రౌడీమూకల చర్యలను నిరసిస్తూ కావలి ఆర్టీసీ ఉద్యోగులు శనివారం ఆందోళన చేపట్టారు. కావలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి, పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలకు ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ర్యాలీగా వెళ్లి లిఖిత పూర్వక వినతిపత్రాలు అందజేశారు. రౌడీమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ ఉద్యోగులమైన తమపై రౌడీమూకల దాడులను ప్రజలందరూ ఖండించాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నెల్లూరు సిటీ: విజయవాడ ఆర్టీసీ డిపో డ్రైవర్‌పై దాడి అమానుషమని, దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎంయూఏ జిల్లా కార్యదర్శి జానా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ వద్ద ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలిలో ఆర్టీసీ డ్రైవర్ బత్తుల రామ్‌సింగ్‌పై కొందరు విచక్షణారహితంగా దాడి చేశారన్నారు. రాత్రి, పగలు నిరంతరం ప్రజల కోసం విధులు నిర్వహించే ఆర్టీసీ ఉద్యోగులపై దౌర్జన్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నిరూపించేలా నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌రెడ్డి, జోనల్ కార్యదర్శి కె.లుక్సన్, డిపో-1 కార్యదర్శి చెంచయ్య, అధ్యక్షుడు బీఆర్ ప్రసాద్, డిపో-2 ఎస్‌ఎంయూ అధ్యక్షుడు సునీల్, కార్యదర్శి శివయ్య, అసోసియేషన్ సభ్యులు బాబూ శామ్యూల్, ప్రసాద్, కట్టా సుబ్రహ్మణ్యం, జిలానీ, దశరథ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గొలగమూడిలో రూ.25 లక్షలతో నిర్మించనున్న చేపల మార్కెట్‌కు శంకుస్థాపనను శనివారం చేపట్టారు. గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గొలగమూడికి చెందిన 251 మందికి ఇళ్ల పట్టాలు, తూర్పు చెరువు రైతులు 32 మందికి 45.18 ఎకరాలకు సంబంధించిన డీకేటీ పట్టాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందని కొనియాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందిస్తున్నారని చెప్పారు. మండలంలోని కామిరేని చెరువు, గొలగమూడిలోని తూర్పు చెరువు రైతుల ఏళ్ల కలను నెరవేర్చేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నానని వివరించారు. ఈ సమస్యలను రైతులు గతంలో మంత్రిగా ఉన్న సమయంలో సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోలేదని ఆరోపించారు. అనికేపల్లిలో రూ.18.6 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. గొలగమూడి – అనికేపల్లి రోడ్డును త్వరలో రూ.3.8 కోట్లతో నిర్మించనున్నామని వెల్లడించారు.

సోమిరెడ్డి జీవితం దోపిడీకే అంకితం

తన జీవితం సర్వేపల్లికే అంకితమని సోమిరెడ్డి పదే పదే చెప్తున్నారని, వాస్తవానికి ఆయన జీవితం ప్రజల సొమ్మును దోపిడీ చేసేందుకే అంకితమని మంత్రి విమర్శించారు. మంత్రిగా రెండుసార్లు అవకాశమొస్తే, సర్వేపల్లిని అడ్డం పెట్టుకొని దోచుకున్నారే తప్ప నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మిల్లర్ల వద్ద ముడుపులు, రైతు రథం, నీరు – చెట్టు పథకాలతో అడ్డగోలుగా దోపిడీ చేసిన సోమిరెడ్డికి ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పారని, సిగ్గు లేకుండా మరో అవకాశమివ్వాలని ఎలా అడుగుతున్నారని ధ్వజమెత్తారు. జేసీ కూర్మనాథ్, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ మోహన్‌నాయుడు, నంబూరు రాజానాయుడు, సర్పంచ్ శీనమ్మ, ఎంపీటీసీ సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


రక్తదానం చేస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ప్రజాసేవకు నిరంతరం అంకితమైన పోలీసులు విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో సీపీ అండ్ పీఎంపీ సహకారంతో ఉచిత మెగా మెడికల్ క్యాంప్.. రెడ్ క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. మనం ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం బాగుంటుందనే విషయాన్ని గుర్తుంచుకొని ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు మెగా మెడికల్ క్యాంప్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, వివిధ కళాశాలల విద్యార్థులను అభినందించారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఎస్పీతో పాటు 500 మంది రక్తదానం చేశారు. ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు వీరాంజనేయరెడ్డి, గాంధీ, చంద్రమోహన్, ఎస్బీ, నగర ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, వైద్యులు మధుసూదన్‌రావు, అశ్విన్‌కుమార్, చైతన్యకుమార్ రెడ్డి, వినీలారెడ్డి, శ్రీలతారెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులు

నెల్లూరు(దర్గామిట్ట): దివ్యాంగులకు కృత్రిమ చేతులను ఉచితంగా పంపిణీ చేయనున్నామని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు అక్బర్ అలీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లెన్ మెడోస్ ప్రోస్తెటిక్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మంగళకరం పేరిట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని చెప్పారు. కృత్రిమ అవయవాలు తేలిక బరువుతో ఉంటాయని.. మోచేయి కింది భాగం కనీసం నాలుగు అంగుళాల చేయి కలిగిన దివ్యాంగులు అర్హులని తెలిపారు. అవసరమైన వారు 72074 03150 నంబర్‌ను సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.


యువతిపై లైంగిక దాడి

పొదలకూరు: యువతిపై లైంగిక దాడి జరిగిన ఘటన మండలంలోని అంకుపల్లి ఎస్సీ కాలనీలో వెలుగులోకి వచ్చింది. తనకు వరుసకు బావ ఈ ఘాతుకానికి పాల్పడ్డారంటూ కండలేరు డ్యామ్ పోలీసులకు బాధితురాలు శనివారం ఫిర్యాదు చేశారు. ఘటనపై మీడియా సమక్షంలో కన్నీటి పర్యంతమయ్యారు. బాధితురాలి వివరాల మేరకు.. ఎస్సీ కాలనీలో తన తల్లితో కలిసి నివసిస్తున్నానని, కాన్పు నిమిత్తం తన సోదరి తల్లితో కలిసి నెల్లూరుకు గత నెల 27న వెళ్లారని, ఈ సమయంలో తన బావ బాలకృష్ణ లైంగిక దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. బయటకు చెప్తే చంపుతానని బెదిరించారన్నారు. నిందితుడు తన సోదరులతో కలిసి ఇంటి వద్దకు శుక్రవారం రాత్రి వచ్చి దౌర్జన్యం చేశారని చెప్పారు. ఇక భరించలేక ఆర్‌వైపాళెం సచివాలయ మహిళా పోలీసులకు సమాచారం అందించానని తెలిపారు. బంధువులతో పాటు బాధితురాలిని రాపూరు సర్కిల్ కార్యాలయానికి తీసుకెళ్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

సంగం: వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంగంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. సంగంలోని వడ్డిపాళేనికి చెందిన వెంకటేశ్వర్లు (70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో పొలాల్లో గడ్డికి కొట్టే మందును సేవించారు. అపస్మారక స్థితిలోకి చేరుకున్న ఆయన్ను గమనించిన కుటుంబసభ్యులు 108లో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. వృద్ధుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఎస్సై నాగార్జునరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడిన ఈఓ మృతి


నవీన్ (ఫైల్)

సంగం: మండలంలోని సిద్దీపురం వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఈఓ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. వివరాలు.. అల్లీపురంలోని గ్రూప్ ఆఫ్ టెంపుల్స్‌లో ఈఓగా పనిచేస్తున్న నవీన్‌కుమార్ (48) విధుల అనంతరం బైక్‌పై సంగానికి బయల్దేరారు. ఈ క్రమంలో సిద్దీపురం వద్ద కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. నెల్లూరులోని వైద్యశాలలో చేర్పించగా, పరిస్థితి విషమించడంతో చెన్నైకు తరలించారు. అక్కడ చికిత్స పొంది రెండు రోజుల క్రితం నెల్లూరు చేరుకున్న ఆయన ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేరారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కాగా స్థానిక సంగమేశ్వరాలయ ఈఓగా గతంలో ఆయన పనిచేశారు.

ప్రాధాన్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ తదితరులు

నెల్లూరు (దర్గామిట్ట): ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. హౌసింగ్, రీ సర్వే, వ్యవసాయం, డెయిరీ డెవలప్‌మెంట్, ప్రాధాన్య భవనాలు, జాతీయ రహదారులకు భూ సేకరణ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో శనివారం ఆయన సమీక్షించారు. రెండో విడతలో మరో ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, త్వరితగతిన వీటిని పూర్తి చేయాలని సూచించారు. కాలనీల్లో మౌలిక వసతులను కల్పించాలని చెప్పారు. అనుభవదారులకు అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

గృహ నిర్మాణంలో జిల్లా ముందంజ

జిల్లాలో గృహ నిర్మాణ ప్రగతిని కలెక్టర్ హరినారాయణన్ వివరించారు. గృహాల స్టేజ్ కన్వర్షన్లలో ప్రగతిని సాధించి ముందంజలో ఉన్నామని చెప్పారు. రీ సర్వే రాళ్ల ప్లాంటేషన్‌ను 99 శాతం పూర్తి చేశామని తెలిపారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు


ప్రిన్సిపల్ పీవీఎస్ రెడ్డి, ఏఓ రమణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట: కడనూతలలోని ఆరెస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్టీయూ, అనంతపురం ఆధ్వర్యంలో వర్సిటీ స్థాయి చెస్ పోటీలను శనివారం నిర్వహించారు. వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ జోజిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వేర్వేరుగా పోటీలను జరిపారు. పోటీలకు 39 మంది విద్యార్థులు, 17 మంది విద్యార్థినులు హాజరయ్యారు. విజేతల వివరాలను యూనివర్సిటీ అనుబంధ వెబ్‌సైట్‌లో త్వరలో ప్రకటించనున్నామని నిర్వాహకులు తెలిపారు. కళాశాల

వాల్మీకి చిరస్మరణీయుడు



నెల్లూరు (దర్గామిట్ట): రామాయణం వంటి మహా గ్రంథాన్ని మనకు అందించిన వాల్మీకి మహర్షి చిరస్మరణీయుడని డీఆర్వో లవన్న పేర్కొన్నారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, వాల్మీకి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రతినిధి చల్లా వెంకట సుబ్బయ్య, బీసీ సంఘాల ప్రతినిధులు ఆదిశేషయ్య, కోటిసింగ్, వెంకటశేషయ్య, నిర్మల, ట్రెయినీ బీసీ వెల్ఫేర్ అధికారి శివలీల తదితరుల పాల్గొన్నారు.

మందుబాబులకు భారీగా జరిమానా

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 43 మందికి రూ.4.3 లక్షల జరిమానాను న్యాయమూర్తి శనివారం విధించారు. వివరాలు.. నగరంలోని వివిధ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను చిన్నబజార్, నార్త్ ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించారు. 43 మంది మందుబాబులపై కేసులు నమోదు చేసి, వీరిని నెల్లూరు రెండో అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శారదారెడ్డి ఎదుట హాజరుపర్చారు. వీరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాలు తప్పవని ఈ సందర్భంగా ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ హెచ్చరించారు.

ఏఈ X సిబ్బంది

ఉలవపాడు: విద్యుత్ శాఖలో ఏఈ, సిబ్బంది మధ్య వివాదం చినికిచినికి గాలివానలా మారింది. కొంతకాలంగా ఈ వివాదం జరుగుతుండగా, సిబ్బంది మూకుమ్మడిగా ఏఈని సబ్‌స్టేషన్ వద్ద శనివారం నిలదీయడంతో రగడగా మారింది. ఉలవపాడు ఏఈగా శ్రీనివాసులు ఐదు నెలల క్రితం బాధ్యతలు చేపట్టారు. అయితే తమతో అసభ్యంగా మాట్లాడుతున్నారని సిబ్బంది.. సక్రమంగా పనిచేయకపోవడంతో మందలిస్తున్నానని ఏఈ చెప్తున్నారు. ఈ క్రమంలో ఉలవపాడు సబ్‌స్టేషన్ వద్దకు ఏఈ శ్రీనివాసులు రాగా, మమ్మల్ని ఎందుకు దూషిస్తున్నారంటూ సిబ్బంది వాగ్వాదానికి దిగారు. మీ దగ్గర పనిచేయలేమని సిబ్బంది చెప్పగా, ఇక నుంచి ఎవర్నీ ఏమీ అనబోనని ఏఈ చెప్పినా వివాదం సద్దుమణగలేదు. దీనిపై సింగరాయకొండ ఏడీ యుగంధర్ వద్దకు సిబ్బంది వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ.5



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్: రూ.130	స్కిన్‌లెస్ చికెన్: రూ.250
లేయర్ : రూ.113	లేయర్ చికెన్ : రూ.192
బ్రాయిలర్ చికెన్ రూ.226	

